

వీర జవాన్లకు ఘననివాళి

పుల్వామాలో జరిగిన తీవ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లకు జిల్లావ్యాప్తంగా ఘనంగా నివాళులు అర్పించారు.
- 8లో ▸



రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నాయని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి విమర్శించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /15.1

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండవచ్చు. రాత్రి చలి తీవ్రత ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నిజామాబాద్‌నాగారం : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన సమావేశాలు ఉంటాయన్నారు. ఉదయం 10.30 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు.

పదిరోజుల పాటు ప్యాసింజర్ రైలు రద్దు

ఖలీల్‌వాడి : నిజామాబాద్‌-సిర్పూర్ ప్యాసింజర్ రైలు పది రోజుల పాటు రద్దయినట్లు రైల్వే అధికారుల ద్వారా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ రైల్వేస్టేషన్ వద్ద మూడో లైన్ పట్టాలు వేస్తున్న సందర్భంగా 15 నుంచి 25 వరకు రైలు రద్దయిందని, ప్రయాణికులు గమనించాలన్నారు.

జెడ్పీ కొత్త భవనానికి నిధులివ్వండి



నిజామాబాద్ నాగారం : ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జెడ్పీ చైర్మన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బదిలీ కోసం 280 దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్ : జిల్లా విద్యాశాఖలో బదిలీలకు సంబంధించి దరఖాస్తుల గడువు మంగళవారం ముగిసింది. జిల్లాలో 317 జీవో కింద బదిలీలు కోరుతూ టీచర్లు 280 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసింది. కొంతమంది టీచర్ల నుంచి హార్డ్‌కాపీలు రావాల్సి ఉంది. దీంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి




నిజామాబాద్ అర్బన్ : ప్రతి ఉపాధ్యాయుడు మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం అర్సపల్లి ప్రభుత్వ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు విద్యబోధనను పరిశీలించారు. ఈ ఏడాది పదో తరగతికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు రావాలని అందుకు ప్రతిఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యమైనదిగా ఉండాలన్నారు.

ఏఎం ఖాన్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

నిజామాబాద్ సిటీ : జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏఎం ఖాన్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేశామని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు ఏఎం ఖాన్ పాల్పడ్డారనే నెపంతో ఆయనను పార్టీ సస్పెండ్ చేసిందని, సస్పెండ్ కాలపరిమితి ముగియటంతో సస్పెన్షన్‌ను ఎత్తివేశామన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి



ఖలీల్‌వాడి : పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని వైఎస్సార్‌టీపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బుస్సాపూర్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వైఎస్సార్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా అంకార్ గణేష్, బీసీ విభాగం నగర అధ్యక్షుడిగా కారంపూరి రవికి నియామక పాత్రలు అందజేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ భూముల్లో కృష్ణ జింకలు (ఫైల్)

వన్యప్రాణి కనువిందు

- ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ భూముల్లో జింకల సందడి మరూ
- రిజర్వాయర్‌లో నీరు తగ్గడంతో తేలిన మైదాన ప్రాంతం
- నదీ పరీవాహకం 50 కిలోమీటర్ల పరిధిలో వన్యప్రాణుల విహారం

శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ మైదాన ప్రాంతం పచ్చిక బయళ్లలో జింకలు, కృష్ణ జింకలు, దుప్పిల సంచారం కనువిందు చేస్తోంది. గోదావరి నదీ పరీవాహకం పొడువునా సుమారు 500లకు పైగా వన్యప్రాణులు మనుగడ సాగిస్తున్నాయి. వచ్చే నెలలో విదేశీ వలస పక్షులూ రానున్నాయి.

(నిజామాబాద్ డెస్క్)
శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వైపు గోదావరి నదీ పరీవాహక ప్రాంతం పచ్చిక బయళ్లలో వన్యప్రాణుల సందడి మొదలైంది. కొన్ని రోజులుగా చెంగుచెంగున గెంతుతూ జింకలు, కృష్ణ జింకలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రెండు నెలలుగా ప్రాజెక్టు నుంచి కాల్వల ద్వారా 36.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. దీంతో రిజర్వాయర్‌లో బయటకు తేలిన ముంపు భూముల్లోని పచ్చిక బయళ్లలోకి వన్యప్రాణులు చేరుతున్నాయి. ఏడెమినిదేళ్ల నుంచి నదీ పరీవాహక ప్రాంతంలో వన్యప్రాణుల సంచారం పెరిగింది. నందిపేట, నికాల్‌పూర్ మొదలు తల్వేద, బాల్కొండ ముప్కాల్, జలాల్ పూర్ గ్రామాల వరకు సుమారు 40 నుంచి 50 కిలో మీటర్ల విస్తీర్ణంలో జింకలు, కృష్ణ జింకలు, నీల్‌గాయి, అడవి కుక్కలు, తోడేళ్లు, నక్కలు 500 పైగా సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. అయితే ఈ వన్యప్రాణులు ఎక్కడి నుంచి వలస వచ్చాయో ఇప్పటి వరకు స్పష్టత రాలేదు.



విదేశీ వలస పక్షులు..

వన్యప్రాణులకు తోడు నదీ పరీవాహక ప్రాంతంలో ప్రతి ఏటా విదేశీ వలస పక్షులు సైతం కనువిందు చేస్తుంటాయి. ఫ్లెమింగోస్ , పెలికాన్ పక్షులు ఆఫ్రికా, ఉత్తర అమెరికా దేశాల నుంచి వలస వస్తాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వీటి సందడి అధికంగా ఉంటుంది. సాగర జలాల్లో చేపలను వేటాడుతూ.. ఒంటి కాలిపై జపం చేస్తూ కనిపిస్తాయి. వీటి జలకాలాటలు చూసి తీరాల్సిందే.

సంరక్షణ చర్యలు

నదీ పరివాహకంలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్మూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో) శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ (డీఆర్‌వో) సుధాకర్ పోలీసుల సహకారంతో గ్రామస్తులను భాగస్వాములను చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వన్యప్రాణుల ప్రాధాన్యత వాటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరిస్తున్నారు. వేసవిలో వన్యప్రాణుల తాగునీటి సమస్య పరిష్కారానికి సాసర్ పిట్‌ల నిర్మాణం, ఆహారం, నీటి సరఫరా చేయడానికి ప్రతిపాదనలు పంపించారు. నందిపేట పరిధిలో బీట్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. నియామకం జరిపితే వన్య ప్రాణుల సంరక్షణకు మరింత దోహదపడుతుంది.



నక్క



డీఆర్‌వో సుధాకర్, ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్



ఫ్లెమింగోస్ బర్డ్స్

వేటాడుతున్న ఊరకుక్కలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదలు ప్రారంభమై రిజర్వాయర్‌లోకి నిండుగా నీరు చేరగానే వన్యప్రాణులు ముంపు భూముల నుంచి సమీపంలోని వ్యవసాయ క్షేత్రాలవైపు వస్తాయి. కొన్ని సందర్భాల్లో జింకలు గ్రామాల్లోకి రావడంతో కుక్కల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. ప్రతి ఏటా ఒకటి లేదా రెండు జింకలు కుక్కలకు ఆహారమవుతున్నాయి. ఇటీవల సీహెచ్ కొండూరు బాద్గుణ గ్రామాల వద్ద రెండు జింకలను ఊరకుక్కలు వేటాడి చంపాయి. ఇప్పటి వరకు మొత్తం సుమారు పది జింకల వరకు కుక్కల దాడికి బలైనట్లు స్థానిక గ్రామస్తుల ద్వారా తెలుస్తోంది. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పంటలకు నష్టం



ప్రాజెక్టులో నీటి నిల్వ పెరిగి రిజర్వాయర్‌లోని భూములు మునిగిపోగానే జింకలు సమీపంలోని తోటల వైపు వస్తాయి. జొన్న, సోయా, బొబ్బరి, మిర్చి లాకలను తినేస్తాయి. వీటి వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. **- లోక లక్ష్మణ్,** రైతు, నూత్‌పల్లి

ఎకో టూరిజంకు ప్రతిపాదన..

గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రూ. నాలుగు కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నందిపేట, ఉమ్మెడ, బాద్గుణ, జలాల్‌పూర్ తదితర పరీవాహక ప్రాంతాల్లో అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్నాం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో రిసార్ట్, హట్స్, రెస్టారెంట్, బోటింగ్, పార్క్‌లు ఏర్పాటవుతాయి. ఈ ప్రాజెక్టుకు అనుమతి లభించగానే ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు చేపడుతారు. ఎకో టూరిజం ఏర్పడిన తర్వాత ఇక్కడి నదీపరివాహక ప్రాంతం రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలుస్తుంది. **- శ్రీనివాస్,** ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఆర్మూర్

కాపాడే ప్రయత్నం చేస్తున్నాం



గ్రామాలవైపు వస్తున్న జింకలను వీధి కుక్కలు వేటాడి చంపుతున్నాయి. గ్రామస్తుల కంట పడితే రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **- నక్కల భూమేష్,** సర్పంచ్, గాదేపల్లి

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్ : జిల్లాలోని ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశామని, అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. మంగళవారం కొత్త కలెక్టరేట్‌లోని టీఎన్‌జీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కోసం శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అంతకుముందు శిబిరంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి సంగం అమృత్‌కుమార్, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుదర్శనం, ఉద్యోగ సంఘాల నాయకులు, కంటి వైద్య నిపుణులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు



నిజామాబాద్ నాగారం : మహాశివరాత్రి సందర్భంగా ఆర్మూర్ నుంచి వేములవాడ, సిద్ధులగుట్ట వరకు, నిజామాబాద్ నుంచి వేములవాడ, సిరికొండ మీదుగా లొంక వరకు స్పెషల్ బస్సులను నడుపుతున్నామని ప్రాంతీయ అధికారి ఉషాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి నుంచి వేములవాడ, మద్దికుంట, కొమరవెల్లి వరకు, బాన్సువాడ నుంచి సోమేశ్వర్ వరకు స్పెషల్ బస్సులను నడుపుతున్నామన్నారు. వివరాలకు ఈ నంబర్లలో సంప్రదించాలన్నారు.

- ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019
- బోధన్ 9959226001
- నిజామాబాద్-1 9959226016
- నిజామాబాద్-2 9959206017
- కామారెడ్డి డిపో 9959226018
- బాన్సువాడ డిపో 9959226020

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..

- ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



బీజేపీ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్ : తెలంగాణ సాధించుకున్న తర్వాత ఏర్పడిన ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తూ వస్తోందని, మోసపూరిత సర్కారును గద్దె దింపి, బీజేపీ, మోదీని ఆశీర్వదించాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 35వ డివిజన్‌లో ప్రజా గోస - బీజేపీ భరోసా శక్తికేంద్రాల కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్లలో 3.5 కోట్ల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం కట్టించిందని, అందులో 70 శాతం ఇళ్లను మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించిందన్నారు. కానీ కేసీఆర్ సర్కారు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేస్తూనే ఉందన్నారు. అర్బన్‌లో కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరినా లబ్ధిదారులకు ఇవ్వట్లేదన్నారు. ప్రతి బడ్జెట్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నిధులు కేటాయిస్తున్నా వాటిని కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. 24 గంటల విద్యుత్ రాక, కాళేశ్వరం నీళ్లు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాగాలు ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు ఇస్తామని మొదట్లో ప్రకటించారని, ఇప్పుడు రూ. 3 లక్షలకు కుదించారన్నారు. రాష్ట్రంలో 16 లక్షల కుటుంబాలకు దళితబంధు ఇవ్వాలంటే 60 ఏళ్లు పడుతుందన్నారు. ఎమ్మెల్సీ కవిత జైలుకు పోతుందని ప్రచారం జరుగుతోందని, తనపై పోటీ చేస్తానని ప్రకటించిందని, ప్రకటనను స్వాగతిస్తున్నానన్నారు. ఆయూష్మాన్ భారత్, ఆవాస్ యోజన, రైల్వే ఓవర్ బ్రిడ్జీలు, అన్నిరకాల పథకాలు దేశ ప్రజలందరి కోసం అమల్జేస్తున్నారని గుర్తుచేశారు. అర్బన్‌లో రఘునాథ చెరువు అభివృద్ధి పనుల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యానారాయణ, కార్పొరేటర్ సుధీర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పల్లె ట్రాన్స్‌ఫార్మర్లు

- ప్రమాదాల బారిన పశువులు
- పిల్లర్లపై ఏర్పాటు చేసి కంచె నిర్మించాలని గ్రామీణుల డిమాండ్
- పట్టించుకోని విద్యుత్ అధికారులు

నిజామాబాద్ నాగారం : పల్లెల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా మారుతున్నాయి. కొన్నేళ్ల క్రితం చిన్నపాటి సిమెంట్‌గద్దెలపై 100 కేవీ, 63 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారానే పల్లెలో ఉన్న ఇళ్లకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా జరుగుతుంది. మున్సిపాలిటీల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు మాత్రం సిమెంట్ పిల్లర్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కంచెలు నిర్మించారు. పల్లెల్లో విస్మరించడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.

డివిజన్	100 కేవీ	63 కేవీ
నిజామాబాద్	1,779	813
డిచ్‌పల్లి	980	560
బోధన్	1,027	653
ఆర్మూర్	3,290	1,912
మొత్తం	7,076	3,947



ఆలూర్ మండల కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఇదీ పరిస్థితి..

జిల్లాలో నిజామాబాద్, డిచ్‌పల్లి, బోధన్, ఆర్మూర్ విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 100 కేవీ గల ట్రాన్స్‌ఫార్మర్లు 7076 ఉన్నాయి. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు 3947 ఉన్నాయి. 90 శాతం ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు లేవు. సిమెంట్ గద్దెలు కొన్నేళ్ల క్రితం నిర్మించడంతో అవి కూడా భూమికి సమాంతరంగా మారాయి. చుట్టూ కంచె లేకపోవడంతో కరెంట్ షాక్ తగిలి ఏడాదికి సుమారుగా 60 వరకు పశువులు చనిపోతున్నాయి.

మున్సిపాలిటీల్లో..

నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల్లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను విద్యుత్ అధికారులు గుర్తించారు. 95 శాతానికి పైగా సిమెంట్ పిల్లర్లు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడంతో పాటు చుట్టూ కంచెలు నిర్మించారు. తద్వారా విద్యుత్ ప్రమాదాలు తగ్గాయి.

పొంచి ఉన్న ప్రమాదాలు..

మండల కేంద్రాలు, పల్లెలో ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టణాల్లో మాదిరిగా ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు, సిమెంట్ ఫిల్లరు ఏర్పాటు చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

కంచెలు, పిల్లర్లు నిర్మించుకోవచ్చు

జిల్లాలోని నాలుగు డివిజన్ల పరిధిలో ఉన్న డీఈలు ఆయా మండలాలు, పల్లెలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు సిమెంట్ పిల్లరు, చుట్టూ కంచెలు ఏర్పాటు చేసుకోవచ్చు. సంబంధిత డివిజన్ అధికారులకు పవర్స్ ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థితిగతులపై నివేదిక తెప్పించుకుని సమస్యలు లేకుండా పరిష్కారాలు చేసుకోవచ్చు. **- రవీందర్,** ఎస్ఈ, విద్యుత్‌శాఖ

పసుపు రైతు కడుపు మండి..

- నగరంలోని మార్కెట్ యార్డుకు తాళం
- రెండ్రోజులుగా పసుపు కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం



మార్కెట్ యార్డు గేటుకు తాళం వేస్తున్న రైతులు

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : పసుపు పంటను మార్కెట్‌కు తీసుకొచ్చి రెండు రోజులవుతున్నా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆగ్రహించారు. ఎన్ని రోజులు వ్యవసాయ మార్కెట్ యార్డులో పడిగాపులు కాయాలంటూ మంగళవారం ధర్నాకు దిగారు. మార్కెట్ మూడు ప్రధాన ద్వారాల గేట్లకు తాళాలు వేసి నిరసనను వ్యక్తం చేశారు. పసుపును కొనుగోలు చేయాలని నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ అధికారులు రైతుల వద్దకు వచ్చి వారిని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రైతులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసులు వచ్చి గేట్లకు వేసిన తాళాలను తీయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్‌కు తెచ్చిన పసుపు రెండు రోజులైనా కొనుగోలు చేయడం లేదని, కొనుగోలు చేసిన దానిని మార్కెట్ అధికారులు తూకం వేయించడం లేదని తెలిపారు. వచ్చిన పసుపును కొనకుండానే కొత్త పసుపును మార్కెట్ లోపలికి అనుమతిస్తున్నారని, దీంతో కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతోందన్నారు. తద్వారా పగలు, రాత్రి మార్కెట్ యార్డులో ఉండాల్సి వస్తోందని వాపోయారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పసుపును రెండ్రోజుల్లో కొనుగోలు చేయించి తూకం వేస్తామని మార్కెట్ యార్డు ద్వితీయ శ్రేణి అధికారి విజయ్ కిషోర్ రైతులకు హామీ ఇచ్చారు.



వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

ఆరు రోజుల దాకా తేవొద్దు..

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఆరు రోజుల దాకా పసుపును తేవొద్దని సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చి పసుపును మార్కెట్‌లో ఎండబెట్టడం మూలంగా కొనుగోలు వేగంగా జరగడం లేదన్నారు. ఈ నెల 13, 14 తేదీల్లో వచ్చిన పంటను 17న కొనుగోలు చేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాబట్టి 21 తేదీ వరకు మార్కెట్‌కు పసుపును తేవొద్దని జిల్లాలోని రైతులకు సూచించారు. **- వెంకటేశం,** సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, వ్యవసాయ మార్కెట్ యార్డు

క్లుప్తంగా

కోర్టులో సాక్ష్యం చెప్పిన ఎంపీ అర్వింద్‌

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ అదనపు జ్యుడీషియల్‌ ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్‌ కోర్టు (జూనియర్‌ సివిల్‌ జడ్జి)లో నిజామాబాద్‌ పార్లమెంట్‌ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ మంగళవారం ఒక క్రిమినల్‌ కేసులో సాక్షిగా హాజరయ్యారు. అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ మహమ్మద్‌ రహీమొద్దీన్‌ నిజామాబాద్‌ ఒకటవ టౌన్‌ పోలీసుల తరఫున ప్రాసిక్యూషన్‌ నిర్వహిస్తూ సాక్షిగా అర్వింద్‌ను జడ్జి కుశనపల్లి సౌందర్య ముందు ప్రవేశపెట్టి ఆయన సాక్ష్యాన్ని నమోదు చేయించారు. 2019 జనరల్‌ పార్లమెంట్‌ ఎన్నికలలో భాగంగా నిజామాబాద్‌ నగరంలోని హాబీబ్‌నగర్‌లో ఎన్నికల పోలింగ్‌ కేంద్రంలో కొందరు టీఆర్‌ఎస్‌ కార్యకర్తలు రిగ్గింగ్‌కు పాల్పడుతూ వారికి అనుకూలంగా ఓట్లు వేయించుకుంటున్నారని, ఆ విషయం తెలుసుకుని బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, యెండల లక్ష్మీ నారాయణ తదితరులతో కలిసి వెళ్లగా కార్యకర్తలపై భౌతిక దాడికి పాల్పడి దౌర్జన్యం చేశారని తెలిపారు. 2019 ఏప్రిల్‌ 11న ఘటన జరిగిందన్నారు.

మా డబ్బులను ఇప్పించండి




సుభాష్‌నగర్‌: గల్ఫ్‌లో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఏజెంట్‌ నుంచి తమ డబ్బులను ఇప్పించాలని బాధితులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహం నాయుడు మాట్లాడుతూ.. ఎడపల్లి మండలం ఎంఎస్‌ ఫారంకు చెందిన షేక్‌ బషీర్‌ డిచ్‌పల్లిలో ఆర్‌కే ట్రావెల్స్‌ పేరుతో ఆఫీస్‌ ఏర్పాటుచేసి గల్ఫ్‌లో ఉద్యోగాల పేరుతో యువతను ఆకర్షించారు. వందలాది మంది నుంచి సుమారు రూ.3కోట్ల వరకు డబ్బులు వసూలు చేసి పరారయ్యాడని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా.. ఇంతవరకూ నిందితుడిని పట్టుకోలేదని తెలిపారు. మెడికల్‌ టెస్ట్‌ పేరుతో రూ.5,600 చొప్పున వసూలు చేసిన విజయ శ్రీ డయాగ్నోస్టిక్‌ సెంటర్‌ యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు.

న్యాయం చేయాలి

మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ వాగులో ఇరుక్కుపోయిన మోటారును ఇటీవల లక్ష్మీరావులపల్లికి చెందిన తోకల సత్యం బయటకు తీసే క్రమంలో నీటమునిగి చనిపోయాడు. దీంతో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని లక్ష్మీరావులపల్లి గ్రామస్తులు, మృతుని బంధువులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు మంగళవారం మాచారెడ్డి పోలీసు స్టేషన్‌ ఎదుట ఆందోళనకు దిగారు. అలాగే కామారెడ్డి–సిరిసిల్లా ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఎస్సై సంతోష్‌కుమార్‌ వారిని సముదాయించి, న్యాయం జరిగేలా కృషి చేస్తా మని చెప్పడంతో ఆందోళన విరమించారు.

అవతార పురుషుడు సేవాలాల్‌

- బంజార ప్రజల ఆరాధ్య ధైవం
- నేడు సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ జయంతి



శ్రీసేవాలాల్‌ మహరాజ్‌ విగ్రహం

నిజామాబాద్‌సిటీ: సంత్‌ సేవాలాల్‌ మహారాజ్‌.. ఈ పేరు వింటే దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది బంజారా ప్రజల హృదయాలు భక్తిభావంతో పరవశించి పోతాయి. గిరిజన తండాలలో ఉన్న సేవాలాల్‌ మహారాజ్‌ ఆలయాలు నిత్యం సేవాలాల్‌ నామస్మరణతో మార్మోగుతుంటాయి. బుధవారం సేవాలాల్‌ మహరాజ్‌ జయంతి సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

సేవాలాల్‌ మహారాజ్‌ను బంజారా(లంబాడ) ప్రజలు తమ కులదైవంగా కొలుస్తారు. మహారాజ్‌ను మోతివాళో, సేవాభాయా అనే పేర్లతో కూడా పిలుస్తారు. తమ బంజారా సమాజాభివృద్ధికి, చైతన్యానికి కృషి చేసిన సేవాలాల్‌ మహారాజ్‌ను అవతార పురుషుడని బంజారా ప్రజలు విశ్వసిస్తారు. ఈసందర్భంగా ప్రతియేటా సేవాలాల్‌ జయంతిని బంజారా ప్రజలు ఘనంగా జరుపుకుంటారు.

సేవాలాల్‌ జన్మవృత్తాంతం..

బంజారా చరిత్ర ఆధారంగా రాథోడ్‌ వంశానికి చెందిన రమావత్‌ భీమానాయక్‌, ధర్మిణి దంపతులకు జగదాంబదేవి అనుగ్రహం కారణంగా 15ఫిబ్రవరి 1739లో సేవాలాల్‌ జన్మించారు. సేవాలాల్‌కు 12 సంవత్సరాలు నిండిన తర్వాత అతనిని తిరిగి నాకు అప్పగించాలని, అతని జీవితం నా భక్తి పూజలకే అంకితం చేయాలని తండ్రి భీమానాయక్‌తో జగదాంబ దేవి షరతు విధిస్తుంది. కానీ ఈ నిబంధనను సేవాలాల్‌ మహారాజ్‌ అంగీకరించడు. దీంతో జగదాంబదేవి సేవాలాల్‌ కుటుంబాన్ని కష్టాల పాలు చేస్తుంది. అయిన సేవాలాల్‌ భయపడడు. ఈక్రమంలో జగదాంబదేవి ఒక రోజు వృద్ధురాలి వేషంలో వచ్చి తన అసలైన విశ్వరూపంతో సేవాలాల్‌ ముందు ప్రత్యక్షమవుతుంది. సేవాలాల్‌ కారణజన్ముడనే విషయాన్ని అతనికి తెలియజేస్తుంది. అప్పటినుంచి సేవాలాల్‌ మహరాజ్‌ దేవి మాతకు పూజలు చేస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించారు.

జయంతి రోజున ప్రత్యేక పూజలు

సేవాలాల్‌ మహారాజ్‌ ఆలయాల్లో జయంతి సందర్భంగా బంజారాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే భోగ్‌ బండార్‌, ఖీర్‌(పాయసం)తో మహారాజ్‌కు నైవేద్యం సమర్పించి ఉపవాసాలు చేస్తారు. ఆయురారోగ్యాలు, సకల సంపదలు ఇవ్వాలని కోరుకుంటారు. అనేక మంది యువకులు సేవాలాల్‌ దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక వైపు అడుగులు వేస్తున్నారు. ప్రతి తండాలో సేవాలాల్‌ మహారాజ్‌ ఆలయంతోపాటు జగదాంబ దేవి ఆలయం ఉంటుంది.

అటవీ ప్రాంతంలో జీవిస్తూ..

సేవాలాల్‌ అటవీ ప్రాంతంలో జీవిస్తూ బంజారా లందరూ భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుంటారని, దాని కోసం ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని సూచించేవారు. ఆధ్మాత్మిక మార్గంలో పయనిస్తేనే సమాజ వికాసం జరుగుతుందని ఉద్బోధించేవారు. తన మహిమలతో వ్యాధిగ్రస్తులకు స్వస్థత చేకూర్చేవారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నారు. ఈవిధంగా సేవాలాల్‌ మహారాజ్‌ దైవ స్వరూపుడిగా, ఆధ్యాత్మిక చైతన్య కారుడిగా పేరు తెచ్చుకున్నారు. చివరకు దేవీ మాత మహిమలతో మహారాష్ట్రలోని పౌరాఘడ్‌లో స్వర్గస్తులైనారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. మహారాజ్‌ సమాధి ఉన్న పౌరాఘడ్‌ ప్రసిద్ధ బంజారా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది.

సెలవుదినంగా గుర్తించాలి..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ జయంతిని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి. సేవాలాల్‌ జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సరిపోవడం లేదు. సేవాలాల్‌ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి. బంజారా సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి.

–బానోత్‌ ప్రేమ్‌లాల్‌, బంజారా కవి, రచయిత



ఆకట్టుకున్న బాలిక విన్యాసం

కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. సాహస విన్యాసాలు చేసే ఓ కుటుంబం పొట్ట తిప్పల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఆర్మూర్‌ ప్రాంత శివారులోకి వచ్చి స్థిరపడింది. ఈక్రమంలో నిజామాబాద్‌లో సోమవారం రాత్రి కుటుంబంలోని చిన్నారి నెత్తిపై బిందెపెట్టుకొని తాడుపై నడుస్తూ సాహసం చేసింది. ఈ విన్యాసం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం వారికి తోచిన సహాయం చేశారు.

–సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌

మొరం పనుల్లో అవినీతి ?

ఎడపల్లి(బోధన్‌): మండల కేంద్రంలోని గురుకుల బాలికల పాఠశాల ఆవరణ ఎత్తు పెంచేందుకు నిర్వహించిన మొరం పనుల్లో అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈమేరకు మొరం ఎంబీ రికార్డు వివాదాస్పదంగా మారింది. ఇటీవల పాఠశాల ఆవరణలో మొరం వేసి ఎత్తు పెంచాలని కలెక్టర్‌ రూ.5లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్‌ అధికారుల లెక్కల ప్రకారం 300 టిప్పర్ల మొరం అవసరముందని ఎస్టిమేట్‌ తయారు చేసి, పనులను స్థానికంగా ఉన్న ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కానీ సదరు కాంట్రాక్టర్‌ పాఠశాల ఆవరణలో వేయవలసిన దానికన్నా తక్కువగా మొరం వేసి, పూర్తిస్థాయిలో మొరం వేసినట్టుగా పంచాయతీరాజ్‌ ఏఈతో ఎంబీ రికార్డ్‌ చేయించుకున్నారు. విషయం తెలిసిన స్థానికులు, పాఠశాల పేరెంట్స్‌ కమిటీ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎంపీపీ శ్రీనివాస్‌, టీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీరామ్‌ పాఠశాలకు వెళ్లి, మొరం వేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్‌ రూ.1,50,000 మొరం వేసి, రూ.3 లక్షల 60వేలకు ఎంబీ రికార్డు చేయించుకుంటే, ఎందుకు స్పందించడం లేదని ప్రిన్సిపాల్‌ను వారు ప్రశ్నించారు. దాతల సహకారంతో చేపట్టిన పనులకు సైతం బిల్లులు చేయించుకున్నారని ఆరోపించారు. సమస్యను కలెక్టర్‌ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్‌ సుహాసిని మాట్లాడుతూ.. మొరం వేయడానికి తాను ఎవరికీ కాంట్రాక్ట్‌ ఇవ్వలేదన్నారు. గ్రామపంచాయతీ వారికి కలెక్టర్‌ ద్వారా నిధులు వస్తే, వారే కాంట్రాక్ట్‌ చేసుకున్నారని, ఈ విషయమై తనకేమీ తెలియదన్నారు.

దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారు





బోధన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌ రెడ్డి.. ధర్మారం గ్రామంలో..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆరోపణ
- పలు మండలాల్లో హాత్‌ సే హాత్‌ జోడో యాత్ర నిర్వహణ

బోధన్‌టౌన్‌(బోధన్‌): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నాయని మాజీ మంత్రి, టీపీసీసీ కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర కోశాధికారి మాజీ మంత్రి సుదర్శన్‌ రెడ్డి విమర్శించారు. పట్టణంలోని రాకాసీపేట్‌ కాలనీ 5వ వార్డులో మంగళవారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్‌ సేహాత్‌ జోడో యాత్రను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జెండాను ఎగురవేశారు. అనంతరం వార్డులోని ప్రతీ ఇంటికి ప్రజల సమస్యలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును వివరించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పాలనను విస్మరించి, స్వీయ అభివృద్ధి పాలన చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలపై పన్నుల భారంతో పాటు నిత్యవసర ధరలు పెంచి నడ్డి విరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆచన్‌పల్లికి చెందిన కాంగ్రెస్‌ కార్యకర్త నాగేశ్వర్‌ రావ్‌ ఇటీవల విద్యుత్‌ షాక్‌తో మృతి చెందగా.. మృతుడి భార్య కల్పనకు రూ. 2లక్షల చెక్కును మాజీ మంత్రి అందజేశారు. పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌ హందాన్‌, నాయకులు పాషామోయినొద్దిన్‌, గంగాశంకర్‌, దొడ్ల రవిందర్‌రెడ్డి, గంగాధర్‌ గౌడ్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, తలారి నవీన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని ధర్మారం, ఎమ్మెస్సీ ఫారం గ్రామాలలో మంగళవారం కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో హాత్‌ సేహాత్‌ జోడో యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి, గడుగు గంగాధర్‌, పులి శ్రీనివాస్‌, గైన పోచయ్య, సూరిబాబు, రత్నాకర్‌ ఉన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



భిక్కనూరులో ట్రాలీ ఆటో యూనియన్‌ ఆధ్వర్యంలో అమర జవాన్ల చిత్రపటాలతో నిర్వహిస్తున్న ర్యాలీ



మద్నూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, స్థానికులు

మద్నూర్‌: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన తీవ్రవాదుల దాడిలో అమరులైన సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. సరిగ్గా నాలుగేళ్ల కిందట జరిగిన దాడిలో మృతి చెందిన జవాన్ల ఆత్మకు శాంతి చేకురాలని మండల కేంద్రంలో మంగళవారం రాత్రి విద్యార్థులు, యువకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించారు.

నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌): వీర జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బీర్కూర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులు, లెక్చరర్లు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ మోహన్‌, అధ్యాపకులు విష్ణు, సతీష్‌, శ్యాం సుందర్‌, దేవిసింగ్‌, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: అమరులైన జవాన్ల ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ భిక్కనూరు శ్రీసిద్ధరామేశ్వర ట్రాలీ ఆటో యూనియన్‌ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జవాన్ల ఫొటోలతో కూడి ఫ్లెక్సీని ఆటోలో ఏర్పాటు చేసి ర్యాలీగా వెళ్లారు.

ఎల్లారెడ్డిరూరల్‌: పుల్వామాలో జరిగిన దాడిలో వీర మరణం పొందిన జవాన్లకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌ నాయకులు మంగళవారం ఎల్లారెడ్డిలోని పలు కళాశాలల్లో విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు.

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌)/డిచ్‌పల్లి: పుల్వామా దాడిలో మరణించిన వీర సైనికులకు సంతాప సూచికంగా మండలంలోని మంచిప్ప గ్రామంలో హిందూవాహిని ఆధ్వర్యంలో చిన్నారులు, యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లి గ్రామంలో గ్రామస్తులు, తెలంగాణ యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మంచిప్ప గ్రామంలో..



సాంపల్లి గ్రామంలో..



తెలంగాణ యూనివర్సిటీలో..

కీచక అధ్యాపకుడిపై చర్యలేవి?

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్‌ కళాశాల బోటని లెక్చరర్‌ నరేశ్‌కుమార్‌ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఇటీవల అతడిపై కేసు నమోదైంది. ఈక్రమంలో అధ్యాపకుడిని విచారించిన అధికారులు అతడిని సస్పెండ్‌ చేయకుండా డిప్యూటేషన్‌పై నాగిరెడ్డిపేట మోడల్‌ కళాశాలకు పంపించారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లెక్చరర్‌ను విధుల నుంచి సస్పెండ్‌ చేయాలని ఏబీవీపీ నగరకార్యదర్శి చరణ్‌ మంగళవారం అడిషనల్‌ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

'కేసుల పరిశోధన వేగవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: కేసుల పరిశోదన వేగవంతం చేయాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని సీఐలు, ఎస్సైలతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. సాక్ష్యాధారాలను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి, నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రామారెడ్డి మండలం పులిగుట్ట వద్ద రెండు బండ రాళ్ల మధ్యలో చిక్కుకున్న రాజును సురక్షితంగా రక్షించిన సిబ్బందికి కలెక్టర్‌ ద్వారా జారీ చేయబడిన ప్రశంసా పత్రాలను అందజేశారు. అదనపు ఎస్పీ అన్యోన్య, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చేయడం సరికాదు

భిక్కనూరు: మండలకేంద్రంలోని పాత జాతీయ రహదారి పక్కన గల ఇళ్లకు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం సరికాదని సీనియర్‌ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు గజ్జెల భిక్షపతి అన్నారు. భిక్కనూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి వెడల్పు పనులను సర్పంచ్‌ తున్కి వేణు ఇష్టారీతిన నిర్వహిస్తున్నాడన్నారు. రోడ్డు బాధితుల పక్షాన తాను నిలబడి కోర్టులో వాదిస్తానన్నారు. ప్రజలకు నష్టం కలుగుతున్నందున కలెక్టర్‌, డీపీవో, ఎంపీవో, సర్పంచ్‌, పంచాయతీ కార్యదర్శిలకు లీగల్‌ నోటీసులు పంపుతున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఇళ్ల కూల్చివేతను నిలిపివేయాలని కోరారు.

క్రైం కార్నర్‌

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మాపూర్‌ గ్రామంలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ఈశ్వర్‌గౌడ్‌కు చెందిన గుడిసెకు సోమవారం అర్ధరాత్రి సమయంలో నిప్పంటుకుని దగ్ధమైనట్లు వారు తెలిపారు. వెంటనే ఫైర్‌ ఇంజిన్‌కు సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు. ప్రమాదంలో లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు.

ముగ్దుంపూర్‌లో కోతుల ఆహారశాల..



నిజాంసాగర్‌: మండలంలోని ముగ్దుంపూర్‌ గ్రామ పంచాయతీ కోతుల ఆహారశాల ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని కోతుల ఆహారశాలలో బాదాం, జామ, చింత, చీమంత, ఉసిరి, నిమ్మ వంటి పలు రకాల 5వేల చెట్లు నాటారు. అటవీ ప్రాంతంలోని చెత్తాచెదారానికి సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు కోతుల ఆహారశాలలోని చెట్లకు అంటుకొని కాలిబూడిద అయ్యాయి. రూ. లక్షల విలువైన ప్రభుత్వం ధనం వృథా అయ్యింది. ఘటనస్థలాన్ని పంచాయతీ కార్యదర్శి సాయిప్రణీత్‌రెడ్డి పరిశీలించి, అధికారులకు సమాచారం అందించారు.

కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు

- భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త
- బీర్కూర్‌ మండలకేంద్రంలో ఘటన



గంగవ్వ (ఫైల్‌)




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): కట్టుకున్న వాడే కాలయముడై భార్యను కడతేర్చాడు. ఈ ఘటన బీర్కూర్‌ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బీర్కూర్‌ మండల కేంద్రంలోని 8వ వార్డులో చాకలి గంగారాం, అతడి భార్య గంగవ్వ నివసించేవారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యభర్తలిద్దరు తరచూ గొడవపడేవారు. ఈక్రమంలో మంగళవారం ఇద్దరి మధ్య గొడవ జరుగగా గంగారం గొడ్డలితో పలుమారు గంగవ్వ మెడపై నరికేశాడు. దీంతో భార్య నెత్తురు మడుగులో కొట్టుకుంటు చనిపోయిందన్నారు. భార్య మృతి అనంతరం భర్త పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడన్నారు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి, వివరాలు సేకరించారు. శవ పంచనామ అనంతరం వివరాలను వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలే కారణమా?

గంగవ్వ హత్య వెనక పలు అనుమానాలు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో తరుచూ గొడవలు పడేవారు. అందులో భాగంగానే హత్యకు దారి తీసి ఉంటుందంటున్నారు. అంతేకాకుండా రెండు రోజుల క్రితం కుల పంచాయతీలో మృతురాలిపై పలువురు పెద్ద మనుషులు చేయి చేసుకున్నారు. దీంతో మంగళవారం భర్తతో గొడవకు దిగడంతో క్షణికావేశంలో హత్య జరిగి ఉంటుందని వినిపిస్తోంది.

నడిపల్లిలో ఒకరి అదృశ్యం



శ్యాంసన్‌ (ఫైల్‌)

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన మేకల శ్యాంసన్‌(47) కన్పించడం లేదని ఎస్సై గణేష్‌ మంగళవారం తెలిపారు. రోజులాగే శ్యాంసన్‌ శుక్రవారం రాత్రి భోజనం చేసి ఇంట్లోనే పడుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబీకులు లేచిచూసేసరికి శ్యాంసన్‌ కన్పించలేదు. వారు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. శ్యాంసన్‌ భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712659852కు సమాచారం అందించాలని కోరారు.

కొక్కొండలో వివాహిత..

ఎల్లారెడ్డి: మండలంలోని కొక్కొండ గ్రామంలో ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై గణేష్‌ మంగళవారం తెలిపారు. కొక్కొండ గ్రామంలో నివాసముండే వడ్డేపల్లి శ్రీనివాస్‌ తన భార్య ఇందిరతో ఈనెల 11న గొడవపడ్డాడు. అనంతరం శ్రీనివాస్‌ ఎల్లారెడ్డికి వచ్చి, తిరిగి ఇంటికి వెళ్లగా ఇంట్లో ఇందిర కనిపించలేదన్నారు. ఇందిర తల్లిదండ్రులకు సమాచారం అందించినా, ఆమె రాలేదని తెలిపారన్నారు. దీంతో శ్రీనివాస్‌ తన భార్య కనబడటంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య



గణేష్‌(ఫైల్‌)

ఖలీల్‌వాడి: నగరానికి చెందిన ఓ యువకుడు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పూర్ణేశ్వర్‌ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని శివాజీనగర్‌ ఐటీఐ ప్రాంతానికి చెందిన గణేష్‌(24) ఓ ఆస్పత్రిలో వాచ్‌మెన్‌గా, మున్సిపల్‌ ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగిగా పనిచేసేవాడు. కొద్దిరోజుల క్రితం ఈఎంఐ వాయిదా పద్ధతిలో ఓ ఫోన్‌ కొనుగోలు చేశాడు. అలాగే చిట్టీలను లేపి, చిట్టీ డబ్బులను కూడా తీసుకున్నాడు. దీంతో ఈఎంఐ, చిట్టీలకు డబ్బులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. ఈక్రమంలో సోమవారం క్షణికావేశంలో ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమన్నారు.

మల్కాపూర్‌లో మరొకరు..

బీబీపేట: అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన అంబల్ల స్వామి(32) తన పొలం వద్దనున్న కొట్టంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని తమ్ముడు కరుణాకర్‌ చూసి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పుల బాధతోనే భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య లత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.